క్లుప్తంగా

వెండితాపడం తయారీకి రూ.50,116 విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండితాపడం తయారీకి నందిగామ పట్టణానికి చెందిన కట్టా ఘనసైదులు, సీతమ్మ దంపతుల కుమారుడు సుధీర్‌కుమార్ రూ.50,116 విరాళంగా అందజేశారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా ఆదివారం విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఘనంగా గరుడసేవ

నందిగామ: పౌర్ణమి నేపథ్యంలో పట్టణ శివారు పల్లగిరిగుట్టపైగల కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గరుడసేవ కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

కొనసాగుతున్న శ్రీలక్ష్మీ జయంతోత్సవాలు

నందిగామ: మండలంలోని మాగల్లు వైకుంఠ నారాయణ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రీలక్ష్మీ జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలోని లక్ష్మీనరసింహ స్వామి వారికి విశేష పూజలు చేశారు. అనంతరం పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి గజవాహన సేవ, స్వామివారికి రథోత్సవాలు నిర్వహించారు. రాత్రి పొద్దుబోయే వరకు ఈ కార్యక్రమాలు కొనసాగాయి.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఎస్‌ఐ సతీష్ ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు



వీరులపాడు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ కోరారు. మండలంలోని జుజ్జూరు, పెద్దాపురం గ్రామాలలో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా ప్రచారాల పేరుతో కవ్వింపు చర్యలకు పాల్పడి ఘర్షణలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



పెండ్యాల(కంచికచర్ల) : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పెండ్యాలకు చెందిన జేఎం ఫౌండేషన్ యూత్ కమిటీవారు గ్రామానికి చెందిన 350మంది పేద ముస్లింలకు ఆదివారం రంజాన్ తోఫా అందజేశారు. ఒక్కొక్కరికి పదికేజీల బియ్యం, నూనె, ఉల్లిపాయలు, సేమియాతోపాటు 150మందికి చీరలు పంపిణీ చేశారు. నాలుగేళ్లుగా రంజాన్ తోఫా పంపిణీ చేస్తునట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

గడ్డివామి దగ్ధం

పోలంపల్లి(వత్సవాయి) : ప్రమాదావశాత్తు వరిగడ్డి వామి దగ్ధమై రూ.40వేలు ఆస్తినష్టం సంభవించిన సంఘటన పోలంపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సామినేని శివప్రసాద్ మూడున్నర ఎకరాలలోని వరిగడ్డిని వామి వేశాడు. మధ్యాహ్నం సమయంలో వరిగడ్డి నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి శివప్రసాద్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన జగ్గయ్యపేట ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ఘటనలో రూ.40 వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

అభివృద్ధిపథంలో ముచ్చింతాల

- మెరుగుపడిన మౌలిక వసతులు
- నాడు–నేడుతో మారిన పాఠశాల
- శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండలంలోని ముచ్చింతాల గ్రామం మునుపెన్నడూలేని విధంగా అభివృద్ధి చెందింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలోని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించి వారి అభ్యున్నతికి విశేషంగా కృషి చేసింది.

రూ.38.50లక్షలతో పాఠశాల అభివృద్ధి..

ముచ్చింతాలలోని యూపీ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.38.50లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం మౌలికవసతులు మెరుగుపరిచారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా నూతన హంగులు కల్పించారు. రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చేపట్టారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు..

గ్రామంలో ఇళ్లులేని 63మందికి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు పంపిణీ చేశారు. ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేయడంతో 40మంది ఇళ్లనిర్మాణాలను పూర్తిచేసుకుని సొంతింటిలో ఉంటున్నారు. మిగిలిన 23ఇళ్లర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. గ్రామంలో ఇళ్లస్థలాలు ఉన్న 30మందికి కూడా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థికసాయం అందించింది. దీంతో వారి సొంతింటి కల నెరవేరింది.



కార్పొరేట్ పాఠశాలను తలపిస్తున్న ముచ్చింతాల ప్రభుత్వ పాఠశాల



జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇళ్లు

రూ.25లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు..

గ్రామంలోని అంతర్గత రోడ్లను రూ.20 లక్షలతో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పూర్తిచేసి, మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరించారు. మరో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు.

రూ.కోటితో రహదారి నిర్మాణం..

ముచ్చింతాల నుంచి వత్సవాయి మండలం తాళ్లూరు వరకు పీఆర్ నిధులు రూ.కోటితో తారు రోడ్డు నిర్మాణం చేశారు. దీంతో రోడ్డు సమస్య పరిష్కారమైంది. జలజీవన్ మిషన్ కింద గ్రామంలో తాగునీటి పైపులైన్, ఇంటింటికి కొళాయి ఏర్పాటుకు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో రూ.65 లక్షల నిధులు మంజూరయ్యాయి.



రూ.కోటితో నిర్మించిన ముచ్చింతాల–తాళ్లూరు రహదారి

రూ.20.36కోట్ల లబ్ధి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆయా ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామస్తులకు ఇప్పటివరకు రూ.20.36కోట్ల రూపంలో లబ్ధిచేకూరింది. అమ్మఒడి, ఆసరా, రైతుభరోసా, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.14.90 కోట్ల మేర నగదు నేరుగా గ్రామస్తుల బ్యాంకు ఖాతాల్లోనే జమ అయ్యింది. ఇక నాన్‌డీబీటీ రూపంలో గ్రామస్తులకు రూ.5.46కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇలా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడం ద్వారా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముచ్చింతాల గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం

ఎమ్మెల్యేకు రుణపడి ఉన్నాం..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసింది. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల జీవన్ మిషన్ నిధులు రూ.65 లక్షలు మంజూరు చేయించినందుకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు ఎంతో రుణపడి ఉంటాం.

–జక్కులూరి రాంబాబు, సర్పంచి

సొంతింటి కలను నిజం చేశారు..



సీఎం జగనన్న ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే ఉదయభాను గ్రామంలో ఇళ్లు లేని 63మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో వారు ఇళ్లు నిర్మించుకున్నారు. దీంతో వారి సొంతింటి కల నెరవేరింది. నాడు–నేడు కింద చేపట్టిన పనులను పాఠశాలకు నూతన హంగులు సమకూరాయి.

–బేరోతుల నాగమణి, ఎంపీటీసీ

నిత్యాన్నదానికి రూ.50వేలు విరాళం



జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని తిరుమలగిరిలో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగు నిత్యాన్నదానానికి జగ్గయ్యపేట పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ తిరుమలరావు రూ.50,116లను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ మేరకు నగదు చెక్కును ఎమ్మెల్యే ఉదయభాను చేతుల మీదుగా తిరుమలగిరి దేవస్థానం పాలకవర్గ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్‌కు ఆదివారం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, నాయకులు లగడపాటి నాగేశ్వరరావు, బద్దూనాయక్, గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.30వేలు విరాళం...

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తెలంగాణలోని కరీంనగర్ పట్టణానికి చెందిన తన్నీరు ముక్కంటి, ఆదిలక్ష్మి దంపతులు రూ.20,116 విరాళంగా అందజేశారు. ఈమేరకు నగదును ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. విజయవాడ రూరల్, రాయనపాడు గ్రామానికి చెందిన శీలంనేని తిరుమలరావు, కనకదుర్గ దంపతులు రూ.10,116లను విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు ప్రత్యేక పూజలు





ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: గత ఎన్నికల సమయంలో మాదిరిగా ఈఏడాది కూడా ఎన్నికల ప్రచార ప్రారంభ సమయంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడం సంతోషంగా ఉందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంతోపాటు చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆశీర్వచనం అందజేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ప్రచార పర్వాన్ని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ క్రమంలోనే దైవదర్శనం చేసుకుని పూజలు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. అనంతరం గుడిమెట్ల గ్రామంలోని చర్చి, మసీదులో కొంతమంది ముఖ్య నాయకులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోవెలమూడి వెంకటనారాయణ, మంగునూరు కొండారెడ్డి, చల్లా బ్రహ్మేశ్వరరావు, కొండా కృష్ణారెడ్డి, షహనాజ్ బేగం, ఆవుల రమేష్‌బాబు, కోటేరు ముత్తారెడ్డి, కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, ముక్కపాటి నరసింహారావు, వెలగపూడి వెంకటేశ్వరరావు, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్ : మ్రానికొమ్మల (మట్టల)ఆదివారం వేడుకలను జగ్గయ్యపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సిఎం చర్చిలో ఫాదర్ గుడిసె జయరాజు ఆధ్వర్యంలో మత గురువులు, సంఘస్తులు ఈత మట్టలు ధరించి చర్చి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫాదర్ జయరాజు ప్రసంగిస్తూ మానవాళి కోసం మరణించవలసిన సమయం ఆసన్నమైనప్పుడు యేసుక్రీస్తు సంతోషంగా యెరుషలేములో ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ పండుగ జరుపుకుంటారని వివరించారు. మాల ధరించిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, సంఘ ప్రతినిధులు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు. పోస్టాఫీసు వద్ద ఉన్న సెయిట్ థామస్ సిఎస్ఐ టౌన్ చర్చిలో డీనరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సీఎస్ఐ కృష్ణా, గోదావరి డయోసిస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాకలపాటి కనకరాజు, జోసఫ్, ఎవాంజలిస్ట్ దారా విజయలక్ష్మి, చర్చి కమిటీ సభ్యులు జడ్సీ. సుందరరావు,దేవరాజు, జంగం కుమార్‌బాబు, స్త్రీల మైత్రి ప్రెసిడెంట్ ఆశాపాల్, కార్యదర్శి ఉషా హరిణి, యూత్ సభ్యులు, సండే స్కూల్ చిన్నారులు, సంఘస్తులు పాల్గొన్నారు. విలియంపేట సిఎస్ఐ చర్చిలో డీనరీచైర్మన్ దర్శన్ సుందర్, క్రిస్టియన్‌పేటలోని సిఎస్ఐ చర్చిలో డీసీ గంధం రవి ఆధ్వర్యంలో, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చి, కోదాడ రోడ్డులోని బేతెస్ద ప్రార్థనామందిరంతోపాటు పలు చర్చిలలో ఈత మట్టలకు పూలు అలంకరించి ప్రదర్శనలు నిర్వహించారు. ప్రార్థనలు నిర్వహించారు.

బలుసుపాడు గ్రామంలో...

స్థానిక సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చిలలో మట్టల ఆదివారం ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో పాస్టర్ హరి, సంఘ పెద్దలు కరిసె సునీత, జయరాజు, మైల నయోమి, అనిత, అమ్మనబోయిన సుశీల, బొక్కా ప్రమీల, ఆరోగ్యం, దైద జ్యోతి, ఆర్‌సీఎం చర్చిలో ఉపదేశి అలోషియస్, సంఘ పెద్దలు మైల మేరి వినీత, గండమాల మాధవి, కొరివి బాబురావు, ఉప్పుతోళ్ల బాలస్వామి, పోలంపల్లి దావీదు, సంఘస్తులు పాల్గొన్నారు.



ఈత మట్టలతో ప్రదర్శన చేస్తున్న పేట సీఎస్ఐ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ పాల్‌రాజు, సంఘస్తులు

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆర్సీఎం చర్చిలో విచారణ గురువు ఫాదర్ పేరం దత్తు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక సీఎస్ఐ చర్చితోపాటు మండలంలోని పరిటాల, గొట్టుముక్కల, చెవిటికల్లు, కొత్తపేట, బత్తినపాడు, మోగులూరు, కీసర, గండేపల్లి తదితర గ్రామాల్లో క్రైస్తవ దేవాలయాల్లో విశ్వాసులు ప్రార్థనలు నిర్వహించారు.

నందిగామ మండలంలో..

నందిగామ: క్రైస్తవ సోదరులు మ్రాని కొమ్మల పండుగను ఆదివారం నందిగామలో ఘనంగా జరుపుకున్నారు. ఆర్‌సీఎం సంస్థ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ నిర్వహించారు. పట్టణంలోని పలు చర్చిలలో, మండలంలోని రాఘవాపురం, రామిరెడ్డిపల్లి, మాగల్లు, కొండూరు, దాములూరు, రుద్రవరం, సోమవరం, పెద్దవరం, లింగాలపాడు, అడవిరావులపాడు, కంచల, పల్లగిరి గ్రామాల్లోని చర్చిల ఆధ్వర్యంలో మ్రానికొమ్మల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



బలుసుపాడులో మ్రానికొమ్మలతో ప్రదర్శన చేస్తున్న ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మట్టల ఆదివారంను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. అల్లూరు ప్యారిస్ ఆధ్వర్యంలో చట్టన్నవరం, చౌటపల్లి, జుజ్జూరు గ్రామాల్లో మట్టల ఆదివారం సందర్భంగా భక్తి గీతాలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. ఆయా గ్రామాల్లో ఈత మట్టలను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ప్యారిస్ పాస్టర్ పత్తిపాటి ఆశీర్వాదం, చట్టన్నవరం మాజీ సర్పంచి మాతంగి విజయ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



రామిరెడ్డిపల్లిలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



చట్టన్నవరంలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

అమ్మవారి తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు



ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన పందిళ్లు



భక్తుల కోసం సిద్ధం చేస్తున్న లడ్డూ ప్రసాదాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఐదురోజుల పాటు నిర్వహించనున్న ఈ తిరునాళ్ల మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మునేరులో నీరు లేనందున 200 షవర్‌బాత్‌లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించడంతోపాటు భక్తులకు ఇబ్బంది లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు తెలిపారు. ఆలయం చుట్టూ పందిళ్లు, తాత్కాలికంగా మునేరు ప్రాంత్లో 20 టాయిలెట్లు, కేశఖండనశాల, భక్తుల సౌకర్యార్థం బస్‌షెల్టర్స్ ఏర్పాటు చేశారు. తిరునాళ్ల ప్రాంతం, అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడులో తాత్కాలికంగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. గుడి చుట్టూ చలివేంద్రాల ఏర్పాటుతోపాటు మొబైల్ ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం 1.50 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశామని ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. అవసరమైతే మరిన్ని లడ్డూల తయారీకి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఈవో వివరించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో ఆలయం వద్ద రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఈవో తెలిపారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారిని బలుసుపాడు గురుధాం వ్యవస్థాపకుడు గెంటేల వెంకటరమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ఆయన పూజలు చేశారు. వెంకటరమణకు ఆలయ చైర్మన్ భరద్వాజ్ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

జగ్గయ్యపేట అర్బన్ : ఆకలితో ఉన్న అన్నార్తుల కోసం భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక సీతారామపురంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత భోజనం కార్యక్రమంలో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులు పాల్గొని ప్రజలకు భోజనాలు వడ్డించారు. ఇలాంటి పుణ్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం గొప్పవిషయమంటూ ఇంటూరి చిన్నాను వారు అభినందించారు. నెడ్‌కాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, పార్టీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పెనుగంచిప్రోలు సర్పంచి వేల్పుల పద్మకుమారి, మార్నెళ్ల సూరారెడ్డి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బద్దూనాయక్ పాల్గొన్నారు.



ప్రజలకు భోజనం వడ్డిస్తున్న విప్ ఉదయభాను, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటూరి చిన్నా

పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్ సీపీని గెలిపిద్దాం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): పేదల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో భారీమెజార్టీతో గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని అనిగండ్లపాడులో ఆదివారం బూత్ లెవల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎంపీగా కేశినేని నాని, ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జాన్ మియా, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంగూరి ప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, నాయకులు బోళ్ల బ్రహ్మం, ధనకోటేశ్వరరావు, దోసపాటి దానయ్య, కె.వెంకటరత్నం, పాలాది వెంకటరమణ, ప్రసాద్ పాల్గొన్నారు.



అనిగండ్లపాడు సమావేశంలో పాల్గొన్న నాయకులు, బూత్ కమిటీ సభ్యులు

ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నేడు

జగ్గయ్యపేట: తిరుమలగిరి, చిల్లకల్లు, గుండబోయినపాలెం, బండిపాలెం, పోచంపల్లి గ్రామాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమావేశాలు నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం తెలిపారు. తిరుమలగిరిలో ఉదయం 8గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం అనంతరం ఆయా గ్రామాల్లో కొనసాగుతుందని వివరించారు.

ఘనంగా ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న విప్ సామినేని ఉదయభాను

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న గంగమ్మ, పోతురాజుల ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ సమీపంలోని కృష్ణానది సమీపంలోని ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అంతే కాకుండా ప్రత్యేక హోమాలు చేశారు. పునః ప్రతిష్ఠా మహోత్సవాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.